క్లుప్తంగా

శివలింగాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే



శివలింగాన్ని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

కందుకూరు అర్బన్: పట్టణంలోని వెంకటనారాయణ బజారులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన శివలింగాన్ని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పబ్బిశెట్టి శివ, మురారిశెట్టి శ్రీకాంత్, చక్కా వెంకట కేశవరావు, మోదడుగు వెంకట నరసింహం, చీదేళ్ల వేణుగోపాల్, ఆలయ ప్రెసిడెంట్ కొత్త వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నల్లమల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

హనుమంతునిపాడు: మండలంలోని వెంగపల్లి ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈఓ జి.పెద్దిరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజర్, రోలు, ఉపాధ్యాయులు హాజర్ రికార్డులు, మధ్యాహ్న భోజన నిర్వహణ రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి తిని రుచి చూశారు. ఈ సందర్భంగా ఎంఈఓ పెద్దిరాజు మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ఇచ్చిన మెనూ తప్పకుండా అమలు చేయాలన్నారు. మెనూ అమలు చేయని ఏజెన్సీలపైచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వంటశాల, వంట పాత్రలు పరిశుభ్రంగా ఉంచాలని కుకింగ్ ఏజెన్సీలకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సావిత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి సబ్ స్టేషన్ పరిధిలోని నందనవనం, వావిలేటిపాడు, కె.బిట్రగుంట, జరుగుమల్లి, దావగూడూరు, చింతలపాలెం గ్రామాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈఈ జి.హర్షిష్ తెలిపారు. 33 కేవీ లైన్ విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం కలగకుండా చెట్లు కొడుతున్నామని, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆలయ పునఃనిర్మాణానికి విరాళం

కందుకూరు అర్బన్: పట్టణంలోని అంకమ్మతల్లి దేవాలయం పునఃనిర్మాణానికి సవిడిబోయిన శ్రీనివాసులు, సవిడిబోయిన తిరుపతయ్య, చీదెళ్ల తిరుపతయ్య (బుజ్జి)లు ఒక్కొక్కరు రూ.25,116 చొప్పున అందజేశారు. పైడిపాటి శ్రీనివాసరావు రూ. 1116 అందజేశారు. కమిటీ సభ్యులు పిడికిటి వెంకటేశ్వరు, ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, సూరం వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ పూజలు



ప్రత్యేక పూజల్లో కుందురు తిరుపతిరెడ్డి దంపతులు

కనిగిరి రూరల్: పట్టణంలోని కేటీఆర్ టెక్నో స్కూల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కేటీఆర్ విద్యా సంస్థల అధినేత, ఆలయ ధర్మకర్త కుందురు తిరుపతి రెడ్డి దంపతులు విశిష్ట పూజల్లో పాల్గొన్నారు. హోమాలు, పూజలు, ధాన్యాదివాసం, నిరాజన మంత్రపుష్పాలు అత్యంత నియమ నిష్ఠలతో జరిగాయి. కార్యక్రమంలో అఖిల భారత వాసవీసత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ గుంట తిరుపతి రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వైఎం ప్రసాద్‌రెడ్డి, సాయిబాబా దేవస్థాన కమిటీ అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం, కన్యకాపరమేశ్వరి దేవస్థాన కమిటీ నాయకులు బి.రమేష్, కొలిపర్తి వెంకట స్వామి పాల్గొన్నారు.

ఊరూరా పింఛన్ సంబరాలు

- తెల్లవారే సరికే ఇంటి ముంగిటకు వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు
- సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా పలకరింపు



పింఛన్ల పంపిణీలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, గృహ సారథులు, కన్వీనర్లు

కనిగిరి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ పింఛన్ కానుక ఇచ్చేందుకు తెల్లవారకముందే లబ్ధిదారుల ఇంటి ముంగిటకు వెళ్లి తలుపు తట్టి చిరునవ్వులతో పింఛన్లు నగదు అందచేశారు. వలంటీర్లతో పాటు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ తిరిగి వారి ఆరోగ్య విషయాలు తెలుసుకుంటూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ఎంతో ఉత్సాహంగా ఆయా ప్రాంతాల్లో తిరిగారు. సొంత బంధువుల్లా ప్రతి లబ్ధిదారుని దగ్గరకు వెళ్లి ఎంతో ఆప్యాయంగా పలకరించి అవ్వ తాతల మోముల్లో చిరునవ్వులు పూయించారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ల కోసం కార్యాలయాల వద్ద గంటల తరబడి నిలబడాల్సి వచ్చేదని, పచ్చ నేతలకు ఇష్టమైతేనే కొత్త పింఛన్లు మంజూరు చేసేవారని, నేడు ఆ పరిస్థితి లేదని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హతే ప్రమాణికంగా ప్రతి ఇంటికి వచ్చి ప్రభుత్వ పథకాలను అందచేస్తున్నారని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

సంబరంలా పింఛన్ల పంపిణీ..

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 2,922 మంది గృహ సారథులు, 315 మంది సచివాలయ కన్వీనర్లు, 1,461 మంది వలంటీర్లు బుధవారం పింఛన్ల పంపిణీ సంబరాల్లో పాల్గొన్నారు. తొలిరోజు దాదాపు 75 శాతానికి పైగా సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు అందచేసినట్లు సమాచారం.

మున్సిపాలిటీలో 75.62 శాతం..

పట్టణంలోని 20 వార్డుల్లోని 12 సచివాలయాల్లో మొత్తం 4,101 పింఛన్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. తొలి రోజు 75.62 శాతం పంపిణీ జరగ్గా..అందుకు గాను 3,101 మంది సామాజిక పింఛన్ల లబ్ధిదారులకు రూ.87,35,750 నగదును పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. మండలంలోని 20 సచివాలయాల్లో మొత్తం 6615 పింఛన్లకు గాను 3,843 పింఛన్లు పంపిణీ చేశారు. సుమారు 58.1 శాతం పంపిణీ జరగ్గా రూ.1,08,13750 నగదును లబ్ధిదారులకు అందచేసినట్లు తెలిపారు.

అవ్వాతాతల మోముల్లో ఆనందం



పింఛను పంపిణీ చేస్తున్న వరికూటి అశోక్ బాబు

టంగుటూరు: వైఎస్సార్ పింఛను కానుక సొమ్మును ప్రతి నెలా ఒకటో తేదీన ఠంఛనుగా అందిస్తుండటంతో అవ్వాతాతల ముఖంలో ఆనందం వెల్లివిరుస్తోందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. బుధవారం టంగుటూరులో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో కలిసి పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. గృహసారథులు తమ పరిధిలోని ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూడాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేసేందుకే సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను నియమించారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛను కోసం పడిగాపులు కాసేవారని, జగనన్న ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీన రూ.2,750 పింఛను సొమ్మును వలంటీర్లు నేరుగా అందిస్తున్నారన్నారు. టంగుటూరు 4వ సచివాలయం పరిధిలో కత్తి అలివేలమ్మకు స్థానిక వలంటీరు షేక్ బీబీతో కలిసి పింఛను అందజేశారు. కార్యక్రమంలో బీసీడి ఉదయ కుమార్, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, వైఎస్సార్ టీఎఫ్ నాయకులు సూదనగుంట వెంకటస్వామి, 4వ సచివాలయం కన్వీనర్ పిలిచర్ల కొటయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.9 లక్షలతో జలజీవన్ మిషన్ పనులు



జలజీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి

హనుమంతునిపాడు: జలజీవన్ పనులతో మార్లెళ్లవారిపల్లి గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య తీరనుందని మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి అన్నారు. జలజీవన్ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 9 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో గ్రామంలో పైపులైన్లు ఏర్పాటు చేసి ఇంటింటికీ పైపులైను ఏర్పాటు చేస్తారన్నారు. దీంతో తాగు, వాడుకనీటి సమస్య తీరనుందన్నారు. వైఎస్సార్ పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, యూత్ అధ్యక్షుడు భవనం క్రిష్టారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేశపోగు గురుప్రసాదు, మండల మహిళా సంఘ అధ్యక్షుడు కస్తాల బేబీ, గ్రామస్తులు బాలాజీ వెంకి, శ్రీను, కొండలరావు, కొండయ్య, ఓబులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

సీఎస్‌పురం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని నారాయణస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్, కోవిలంపాడు సచివాలయ రథ సారథి దుగ్గిరెడ్డి జయరెడ్డి అన్నారు. కోవిలంపాడు పంచాయతీలో బుధవారం జరిగిన పింఛన్ పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలి ముద్రలు పడక పింఛన్ నగదు లబ్ధికి నోచుకోని వృద్ధుల సౌకర్యార్థం ఆధార్‌కార్డు ఆధారంగా పింఛన్ నగదు పంపిణీ చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఎంపీటీసీ గోను సరస్వతీ వెంకటేశ్వరరెడ్డి, వలంటీర్లు రాధ, సావిత్రి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం



పార్టీ ముఖ్య నేతలతో కొండపి నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్లు

– కొండపి నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్లు

టంగుటూరు: తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో వైఎస్సార్ సీపీ సెంట్రల్ కార్యాలయం కోఆర్డినేటర్ లేళ్ల అప్పిరెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారులు ధనుంజయరెడ్డి, జేసీఎస్ జోన్ కోఆర్డినేటర్ పుత్తా శివశంకర్, ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. సదస్సుకు కొండపి, టంగుటూరు, సింగరాయకొండ, జరుగుమల్లి, మర్రిపూడి, పొన్నలూరు మండలాల జేసీఎస్ కన్వీనర్లు గొట్టిపాటి మురళి, చింతపల్లి హరిబాబు, తన్నీరు సుబ్బారావు, తాటికొండ రామచంద్రరావు, పూనూరి సంజీవరెడ్డి, పిల్లి తిరుపతిరెడ్డి హాజరయ్యారు. పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు నేతృత్వంలో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని జేసీఎస్ కన్వీనర్లు పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి



ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పామూరు: తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులకు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. పామూరుతోపాటు మండలంలోని పడమటి కట్టకిందపల్లె, వీరబద్రాపురం, చిలంకూరు గ్రామాల్లో పట్టభద్రులతో పాటు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులను కలిసి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటువేయాలని ఓటర్లను అభ్యర్థించారు. జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, సీహెచ్.జయరామిరెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య, చల్లా శివయ్య, కోడూరి రామసుబ్బారెడ్డి, మలినేని నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



మోడల్ స్కూల్ ప్రాంతంలో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: మోడల్ స్కూల్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో చర్యలు తీసుకుంటానని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని మోడల్ స్కూల్ ప్రాంతాన్ని బుధవారం చైర్మన్ గఫార్ పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ట్యాంకర్ల ద్వార మంచి నీటి సరఫరా కాకుండా పైప్ లైన్ ద్వారా సాగర్ నీళ్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డులో విద్యార్థులు పడుతున్నందున తక్షణ చర్యగా రోడ్డు మరమ్మతులు చేయిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో మోడల్ స్కూల్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఏఈ మాధవరెడ్డి, ఎమ్యునిటీ అధికారులు షంషీర్, బ్రహ్మారెడ్డి, షరీపుద్దీన్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



పలుకూరులో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

కందుకూరు రూరల్: ప్రతి రోజు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని వైఎస్సార్ ఉద్యానవన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ విజయపద్మ అన్నారు. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉద్యాన కళాశాల ద్వారా దత్తత గ్రామమైన పలుకూరులో ఆరో రోజు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బుధవారం యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ బీవీ రమణ విద్యార్థులకు ప్రాణాయామం, యోగాసనం, ధ్యానం వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. మహిళా పోలీస్ మానస బాలికలకు దిశ చట్టం గురించి వివరించి, దిశ యాప్‌ను ఎలా ఉపయోగించాలో తెలిపారు. అనంతరం ధూమపానం, మద్యపానం వల్ల కలిగే అనర్థాలు గురించి గ్రామంలో వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ యేహాను పాల్గొన్నారు.

శిక్షణ తరగతులకు హాజరైన జేసీఎస్ కో ఆర్డినేటర్లు



పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌ను కలిసి సంఘీభావం తెలిపిన కో ఆర్డినేటర్లు

కందుకూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల జేసీఎస్ పట్టణ, మండల, కోఆర్డీనేటర్లు తిరుపతిలో జరిగిన శిక్షణ తరగతులకు బుధవారం హాజరయ్యారు. తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని కలిసి సంఘీభావం తెలిపారు. శిక్షణ తరగతులకు ముప్పవరపు కిషోర్, చీమల రాజా, అనుమోలు వెంకటేశ్వర్లు, వరికూటి కృష్ణారెడ్డి, గాజుల కిషోర్, వెలిచర్ల ధనకోటి ఉన్నారు.

జెడ్పీ స్థలం ఆక్రమిస్తే చర్యలు



జెడ్పీ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

పొన్నలూరు: పొన్నలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్లు 264, 266లో ఉన్న జెడ్పీ స్థలాన్ని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ పి.రత్నజ్యోతి హెచ్చరించారు. స్థానిక పంచాయతీ అధికారులు బుధవారం జెడ్పీ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇటీవల జెడ్పీ స్థలం ఆక్రమణకు గురవుతున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు అందిందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారుల సహకారంతో జెడ్పీ స్థలానికి హద్దులు ఏర్పాటు చేశామన్నారు. జెడ్పీ స్థలం ఆక్రమించి గృహాలు నిర్మించిన వారిని కూడా గుర్తించామని, వీరికి నోటీసులు అందజేసి వారి హక్కు పత్రాలు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటి ముంగిటకే వైద్యం

గుడ్లూరు: గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఇంటి ముంగిటకే మెరుగైన వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటా వైద్యం- ఫ్యామిలీ డాక్టర్ లక్ష్యమని మండల వైద్యాధికారి మారుతీరావు అన్నారు. మండలంలోని చినలాటరఫి గ్రామంలో బుధవారం ఇంటింటా వైద్యం-ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందచేశారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి గృహాలకు వెళ్లి వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.కార్యక్రమంలో వైద్య సిబ్బంది,ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆర్చికి శంకుస్థాపన



యోగానంద నరసింహస్వామి ఆలయ ఆర్చికి శంకుస్థాపన చేస్తున్న ట్రస్ట్ బోర్డు సభ్యులు

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆవరణలో యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఉపాలయం వద్ద రూ.6 లక్షల వ్యయంతో ఆర్చి నిర్మాణానికి బుధవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉదయగిరి శేష లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య శంకుస్థాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు మాట్లాడుతూ.. చెన్నైకి చెందిన అప్పనబోయిన సంజీవరావు, అరుణజ్యోతి దంపతుల సహకారంతో ఆర్చి నిర్మాణం చేపట్టామని తెలిపారు. దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆలయ ఈఓ పి.కృష్ణవేణి, ట్రస్టు బోర్డు డైరెక్టర్లు రాజు కోటేశ్వరమ్మ వెంకటేశ్వరరెడ్డి, అప్పనబోయిన వీరాంజనేయులు, అంజనాదేవి, గోకరాజు పాపయ్యనాయుడు, రిటైర్డ్ హెచ్ఎం రావులకొల్లు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి

గుడ్లూరు: ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో మండలంలో జరుగుతున్న ఉపాధిహామి పనులపై టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లకు బుధవారం సమీక్ష నిర్వహించారు. సమీక్షలో పాల్గొన్న ఎంపీడీఓ మాట్లాడుతూ పనులు కావాలని అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాల్సిన బాధ్యత ఫీల్డు అసిస్టెంట్లదే అన్నారు. ప్రతి రోజు కొలతల ప్రకారం పనులు ఇచ్చి రోజు వారి కూలీ రూ.257 పడేలా చూడాలన్నారు. గ్రామస్తులకు, రైతులకు ఉపయోగ పడే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు ప్రతి రోజు జరుగుతున్న పనులను పర్యవేక్షణ చేయాలన్నారు. మస్టర్‌లలో అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. ఏపీఓ వినయ్, ఈసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: ఉపాధి హామీ పథకంలో రోజు వారి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ జి.కృష్ణారావు అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో టీఏలు, ఎఫ్ఏలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల సంఖ్య పెంచాలన్నారు. పని కావాలని ముందుగా డిమాండ్ నోటీస్ ఇచ్చిన ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. ఇచ్చిన కొలతల ప్రకారమే బిల్లులు చెల్లింపులు జరుగుతాయన్నారు. ఏపీఓ వెంకటేశ్వర్లు, టీఏలు వెంకట్రావు, కిషోర్, బి.కిషోర్, అంకమ్మరావు, వెంకటేశ్వర్లు, రజనీ పాల్గొన్నారు.